Office Of The Advisor (communications)
Govt. Of Andhra Pradesh

PRESS RELEASE

# భారత్‌లో పెట్టుబడులకు ఏపీ సరైన గమ్యస్థానం

## ప్రశంసలతో ముంచెత్తిన కియా ప్రెసిడెంట్ హూన్ వూ పార్క్

## సౌరవిద్యుత్తు రంగంలో పనిచయడానికి ఓసిఐ ఆసక్తి

## ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పాదక యూనిట్ల స్థాపనకు ఎల్‌జీ సంసిద్ధత

## ఇంతక సాంకేతిక ఉన్న సీఎంను చూడలేదు: ఎల్‌జీ కితాబు

## చంద్రబాబు మూడో రోజు పర్యటనకు అపూర్వస్పందన

సియోల్, డిసెంబర్ 6: కియా పెట్టుబడుల విస్తరణకు, ఆంధ్రప్రదేశ్‌ను సరైన స్థానంగా గుర్తించినట్లు ఆ సంస్థ ప్రెసిడెంట్ హూన్ వూ పార్క్ స్పష్టం చేశారు. దక్షిణ కొరియా పర్యటనలో మూడో రోజు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం పాల్గొన్న కియా మోటార్స్, కొరియాలోని ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన సంయుక్త బిజినెస్ సెమినార్‌లో హూన్ వూ పార్క్ ప్రసంగించారు. భారత మార్కెట్ వాల్యూపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో తమ పరిశ్రమకు అనుమతులు త్వరితగతిన పూర్తిచేశారని, ఏడాదిలో చేస్తారని తాము భావిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కేవలం మూడు నెలల్లో తమకు కేటాయించిన భూమిలో అభివృద్ధి పనులు పూర్తిచేసి ఆశ్చర్యంలో ముంచెత్తిందని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమ ఏర్పాటు తమకు మంచి అనుభవం అని హూన్ వూ పార్క్ అన్నారు. సదస్సుకు స్వాగతం పలికిన భారత రాయబారి విక్రమ్ దొరైస్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ శర వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం. పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. కొరియన్ పారిశ్రామిక వేత్తలు ఏపీలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

## ఏపీలో సౌరవిద్యుత్తు ప్లాంట్‌లు నెలకొల్పేందుకు ఓసీఐ కంపెనీ ఆసక్తి

మూడో రోజు ముందుగా ముఖ్యమంత్రి ఓసీఐ కంపెనీ సీఈవో వు హ్యూమ్ లీ (Woohyum Lee)తో సమావేశమయ్యారు. సౌరవిద్యుత్తు రంగంలో వివిధ దేశాలలో తమ సంస్థ జరుపుతున్న కార్యకలాపాలను, తమ బలాలను, సామర్థ్యాలపై ప్రెజెంటేషన్ ఇచ్చారు. భారత్‌లో కార్యకలాపాలను ప్రారంభించేందుకు ఆసక్తిగా ఉన్నట్టు తెలిపారు. కొరియా చిన్న దేశమైనందున వివిధ దేశాలలో తమ విస్తృతిని పెంచుకునేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. గత ఏడాది విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సుకు ఓసీఐ కి ప్రాతినిధ్యం వహిస్తూ తాము హాజరయ్యామని సీఈవో హ్యూమ్ లీ గుర్తు చేశారు.

అప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని నిశితంగా పరిశీలిస్తున్నామని హ్యూమ్ లీ తెలిపారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో ఆంధ్రప్రదేశ్ విధానం తనను ఎంతగానో ఆకట్టుకుందని ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ సౌర విద్యుత్ రంగంలో ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఓసిఐ సిఇఓను కోరారు. సమావేశంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిమూ హియో (Kimoo Heo), సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సుంగ్ జూన్ కిమ్ (SungJoon Kim), టీమ్ మేనేజర్ జే వూక్ బేక్ (JaeWook Beak) తదితరులు పాల్గొన్నారు. కాగా ఓసీఐ సంస్థ అమెరికాలోని టెక్సాస్, న్యూజెర్సీ, జార్జియా రాష్ట్రాలలో, మలేసియాలో సౌరవిద్యుత్తు రంగంలో కార్యకలాపాలు కొనసాగిస్తోంది.

## తొలిసారి దేశందాటి వస్తున్నాం, ముందుగా ఏపీలోనే మా పరిశ్రమ: ఎల్‌జీ

ముఖ్యమంత్రి చంద్రబాబు సుప్రసిద్ధ ఎలక్ట్రానిక్ సంస్థ ఎల్‌జీతో ప్రెసిడెంట్ సూన్ క్వోన్ (Soon Kwon) తో సమావేశమై తమ సంస్థ కార్యకలాపాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ఏపీలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరగా సూన్ క్వోన్ సానుకూలంగా స్పందించారు. ఇప్పటివరకు తాము తయారీరంగంలో కొరియా దాటి పూర్తిస్థాయిలో మరే దేశానికి వెళ్లలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రతిపాదనను పరిశీలిస్తామని స్పష్టం చేశారు. ఇండియాలో మిగిలిన రాష్ట్రాల కంటే ఏపీకి ఉన్న అనుకూలతలు ఏమిటని ఎల్‌జీ ప్రెసిడెంట్ సీఎంను అడిగి తెలుసుకున్నారు. దేశంలో వ్యాపార అనుకూలత కలిగిన రాష్ట్రాలలో ఇప్పటికే తాము నెంబర్ వన్‌గా ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

మరో కొరియన్ కంపెనీ కియా మోటార్స్ ఏపీలో స్థిరపడిన విధానం, ఫాక్స్‌కాన్ తమిళనాడును వదిలి ఏపీకి వచ్చి 13వేల మందితో పనిచేస్తున్న వివరాలను ముఖ్యమంత్రి ఎల్‌జీ కంపెనీ సీఈఓ సూన్ క్వోన్ దృష్టికి తెచ్చారు. దేశ సగటు వృద్ధి రేటు కంటే రెట్టింపు వృద్ధి రేటు సాధిస్తున్నామని చెప్పారు. ఏపీకి విస్తరించే ప్రతిపాదనను తమ బోర్డుతో చర్చిస్తామని సూన్ తెలిపారు. స్టోరేజ్ బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్ రంగాలలో పెట్టుబడులకు తమకు ఆసక్తి ఉందని ఆయన చెప్పారు. ఒకసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి అక్కడ ఉన్న వ్యాపార అనుకూలతలను పరిశీలించాలని చంద్రబాబు సూచించారు. కాగా ఇంత సాంకేతిక పరిజ్ఞానంతో ఒక ప్రభుత్వాధినేతను చూడటం తనను ఆశ్చర్యపరుస్తోందని ఎల్‌జీ సంస్థ ప్రెసిడెంట్ సూన్ ప్రశంసాపూర్వకంగా అన్నారు. ఇదిలా ఉంటే ఎల్‌జీ సంస్థ భారత్‌లో ఇప్పటికే ఎంతో గుర్తింపు పొందింది. మాన్యుఫ్యాక్చరింగ్, ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, ఓఎల్ఈడీ, ఎల్ఈడీ, స్క్రీన్స్ వంటి డిస్‌ప్లే సిస్టమ్ తయారీ రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తోంది.

## డార్క్స్ (Darcl) డైరెక్టర్ బెన్నీ కాంగ్ తో భేటీ

తర్వాత దక్షిణ కొరియాలోని అతిపెద్ద లాజిస్టిక్ సంస్థ డార్క్స్(Darcl) డైరెక్టర్ బెన్నీ కాంగ్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఏపీలో ఏర్పాటు చేస్తున్న లాజిస్టిక్ యూనివర్సిటీలో భాగస్వామి కావాలని ఆయన్ని కోరారు. లాజిస్టిక్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం అపూర్వం, అందులో భాగస్వామ్యం కావడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నామని బెన్నీ ముఖ్యమంత్రికి తెలిపారు.

ముఖ్యమంత్రి బృందంలో ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, వాణిజ్యం, పరిశ్రమలు, ఆహారశుద్ధి శాఖల మంత్రి అమరనాథరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, సీఎంవో ముఖ్య కార్యదర్శి జి. సాయిప్రసాద్, పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోకియా రాజ్, ఈడీబీ సీఈవో జాస్తి కృష్ణకిశోర్, ఏపీఐఐసీ ఎండీ అహ్మద్ బాబు ఉన్నారు.